సమగ్ర తెలుగు దినపత్రిక

Website: www.adugunews.com

# అడుగు

The Step Towards The Truth..

హైదరాబాద్ | గురువారం 21 మే 2026 | సంపుటి: 02 | సంచిక: 84 | పేజీలు: 4 | వెల: రూ.6:50

Published from Telangana, Andhra Pradesh | చీఫ్ ఎడిటర్: డాక్టర్ మార్గం లక్ష్మీనారాయణ | Mail: adugudaily@gmail.com

## ట్రంప్‌కు కళ్లెం!

### యుద్ధ అధికారాలను పరిమితం చేస్తూ తీర్మానం

వాషింగ్టన్,మే20(అడుగు న్యూస్): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇరాన్‌పై ఆయన దూకుడు ప్రవర్తనకు అమెరికా సెనెట్ క్లళెం వేసింది. అధ్యక్షుడి యుద్ధ అధికారాలను పరిమితం చేసే తీర్మానానికి తాజాగా ఆమోదం లభించింది. ఫిబ్రవరి చివరిలో ఇజ్రాయెల్‌తో కలిసి ట్రంప్ ఇరాన్ పై యుద్ధానికి దిగారు. యుద్ధంపై ట్రంప్ అధికారాలను పరిమితం చేసేందుకు డెమోక్రట్లు మిగతా 3లో..

## భారత్ కు పుతిన్, జిన్‌పింగ్

### ఢిల్లీ వేదికగా బ్రిక్స్ శిఖరాగ్రం

### సెప్టెంబర్ 12, 13 తేదీల్లో జరిగే అవకాశం

న్యూఢిల్లీ,మే20(అడుగు న్యూస్): భారత్‌లో ఈ ఏడాది సెప్టెంబర్ 12,13 తేదీల్లో బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం జరగనున్నది. దీనికి రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధినేత షీ జిన్‌పింగ్ హాజరుకానున్నట్టు తెలుస్తోంది. న్యూఢిల్లీ వేదికగా జరగనున్న ఈ సమావేశాలకు పుతిన్ హాజరవుతారని దక్షిణాఫ్రికాలోని రష్యా ఎంబసీ ధ్రువీకరించినట్టు స్థానిక మీడియాలో కథనాలు వచ్చాయి. జిన్‌పింగ్ కూడా ఈ సమావేశాలకు హాజరయ్యే అవకాశాలు మిగతా 3లో..



# క్యూ్యర్‌లో డేటా సిటీ

- 1500 ఎకరాల్లో హైదరాబాద్ వెలుపలా జీసీసీలు
- పెట్టుబడుల కోసం ఇన్వెస్ట్ తెలంగాణ ఏజెన్సీ
- వైద్య పర్యాటక కేంద్రంగా హెల్త్ సిటీకి చొరవ
- ఫ్యూచర్ సిటీలో ప్రజాప్రతినిధులు, ఐఏఎస్ లు,
- జర్నలిస్టులకు 500 ఎకరాలు కేటాయింపు
- పరిశ్రమల శాఖ సమీక్షలో సీఎం రేవంత్ సూచనలు



హైదరాబాద్,మే20(అడుగు న్యూస్): ఐటీ రంగాన్ని హైదరాబాద్‌కే పరిమితం కాకుండా జిల్లాలకు విస్తరించే దిశగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. హైదరాబాద్ వెలుపల గ్లోబల్ కెపబిలిటీ సెంటర్స్ ఏర్పాటు చేసే సంస్థలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలని నిర్ణయించారు. నిజామాబాద్,కరీంనగర్,వరంగల్ హైవేల వెంట జీసీసీలు, ఐటీ సంస్థలు ఏర్పాటు అయ్యేలా కార్యాచరణ రూపొందించాలని సీఎం అధికారులను ఆదేశించారు. 'బియాండ్ హైదరాబాద్' ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లాల్లో ఐటీ విస్తరణ ద్వారా యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అదేవిధంగా డేటాసెంటర్ల ఏర్పాటుకు కంపెనీలకు ఇన్సెంటివ్స్ ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. మిగతా 2లో..

## అవినీతిపై ఉక్కుపాదం

- బాధ్యతాయుతంగా పోలీసింగ్
- డ్రగ్స్ బాధితులకు డీ అడిక్షన్ సెంటర్లు
- సైబర్ క్రైమ్ నియంత్రణపై సమగ్ర నివేదిక
- ఫోరెన్సిక్, డేటా సెంటర్లను పెంచాలి
- ప్రభుత్వాదాయంపై గండికొట్టే వారిపై విజిలెన్స్
- పోలీసు వాహనాలన్నీ ఇకపై ఈవీలే
- పోలీస్ ఉన్నతాధికారుల భేటీలో సీఎం రేవంత్

హైదరాబాద్,మే20(అడుగు న్యూస్): డ్రగ్స్ బాధితుల కోసం ప్రత్యేక డి అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని సిఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. ఎంసీఆర్ హెచ్ ఆర్‌డి బోధి పెవిలియన్ లో పోలీస్ సీనియర్ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం అయ్యారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రాష్ట్ర భద్రతా సలహాదారు శివధర్ రెడ్డి,డీజీపీ సీవీ ఆనంద్, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి ,అదనపు డీజీ లు,పోలీస్ కమిషనర్ లు,ఐజీ లు.సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిం మాట్లాడుతూ... మిగతా 2లో..

## మెలోనీకి మో(లో)డీ!

- ఇటలీ ప్రధానికి భారత్ ప్రధాని మెలోడీ టోఫీలు
- మోదీపై ఆత్మీయతను చాటుకున్న మెలోనీ
- ఎఐ, అంతరిక్షం, అణు రంగాల్లో సహకారం
- ఇటలీ అధ్యక్షుడితోనూ ప్రధాని మోదీ చర్చలు
- 5 దేశాల పర్యటనను ముగించుకున్న ప్రధాని

న్యూఢిల్లీ,మే20(అడుగు న్యూస్): భారత్–ఇటలీ ద్వైపాక్షిక సంబంధాలు సరికొత్త శిఖరాలకు చేరాయని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీతో జరిగిన విస్తృతస్థాయి చర్చల అనంతరం ఏర్పాటు చేసిన సంయుక్త మీడియా సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. 'భారత్–ఇటలీ సంయుక్త వ్యూహాత్మక మిగతా 3లో..

## మోదీ, షాలు దేశాన్ని అమ్మేశారు

- ఆర్థిక వ్యవస్థను అంబానీ, అదానీలకు అప్పగించారు
- రాహుల్ గాంధీ ధ్వజం, రాహుల్ ది రాక్షసత్వం: బీజేపీ



న్యూఢిల్లీ,మే20(అడుగు న్యూస్): దేశ రాజ్యాంగంపై నిరంతరాయంగా దాడులు జరుగుతున్నాయని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. రాజ్యాంగాన్ని బలహీనపరిచే కుట్రలు సాగుతున్నాయని, దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పిలుపునిచ్చారు. ఉత్తర్‌ప్రదేశ్ రాయ్‌బరేలీలో జరిగిన బహుజన్ స్వాభిమాన్ సభలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. భారత రాజ్యాంగం అనేది కేవలం ఒక సాధారణ పత్రం కాదని, అది డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మిగతా 3లో..

## కులగణన తప్పనిసరే

- ప్రభుత్వాలకు అసవరం
- వివరాలు తెలియకుండా సంక్షేమమెలా?
- జనగణనలో కులగణనకు సుప్రీం ఓకే
- వ్యతిరేకిస్తూ వచ్చిన పిటిషన్ల తిరస్కరణ

2 లో

# ఎఫ్ఆర్బీఎం మినహాయించండి

### 'సాస్కీ' కింద రూ. 5వేల కోట్ల సాయం చేయండి

### గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులపై సింగరేణి ఆసక్తి

### కేంద్రమంత్రులు నిర్మల, కిషన్ రెడ్డిలతో భట్టీ భేటీ



న్యూ ఢిల్లీ, మే 20 (అడుగు న్యూస్): ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డిలను వేర్వేరుగా కలిసి రాష్ట్ర అభివృద్ధిపై చర్చించారు. కేంద్ర ఆర్థిక మంత్రితో జరిగిన భేటీలో.. రాష్ట్రంలో విద్యా, వైద్య రంగాలు, గ్రామీణ మౌలిక వసతుల కోసం ప్రభుత్వం భారీగా పెట్టుబడులు పెడుతోందని వివరించారు. ముఖ్యంగా 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' స్థాపనతో పాటు విద్యా రంగంలో రూ. 30,000 కోట్ల పెట్టుబడుల ప్రణాళికను అమలు చేస్తున్నందున, దీనికి ఎఫ్ఆర్‌బీఎం మిగతా 2లో..

## చచ్చినా కాషాయాన్ని వీడను

- నా శవంపై బీజేపీ జెండానే కప్పాలి
- బీఆర్ఎస్ పాలనను బద్దలు కొట్టింది మేమే
- ఆ కోపంతోనే నాపై పెద్ద ఎత్తున దుష్ప్రచారం
- ఆరోపణలు వచ్చినందుకే నా కొడుకును...
- స్వచ్ఛందంగా పోలీసులకు అప్పగించా..
- మీడియాతో కేంద్రమంత్రి బండి సంజయ్ ఉద్వేగం

హైదరాబాద్, మే 20 (అడుగు న్యూస్): తాను కొత్త పార్టీ పెడుతున్నట్లు, కేంద్ర క్యాబినెట్ నుండి త్వరలోనే తొలగించబోతున్నట్లు సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై కేంద్ర మంత్రి, బీజేపీ నేత మిగతా 2లో..

## రానున్న 4 రోజుల్లో మరింత తీవ్రం

- 47 డిగ్రీలు కూడా దాటే అవకాశం
- తీవ్రంగా వీయనున్న వడగాల్పులు
- మధ్యాహ్న ప్రయాణాలు వద్దు : సీఎం
- కలెక్టర్లను అప్రమత్తం చేసిన రేవంత్

2 లో

# మెట్రో విస్తరణకు సిద్ధం

- ఖర్చు చెరి సగం, రెండో దశకు మోక్షం
- మూసీ ప్రక్షాళనకు కేంద్రం సహకారం
- కేంద్రమంత్రి ఖట్టర్ తో కిషన్ రెడ్డి భేటీ
- పారిశుధ్యం, ప్రజారవాణా, నగరపురోగతిపై చర్చ
- నగరానికి 39 మురుగునీటి శుద్ధి ప్లాంట్ల మంజూరు



న్యూ ఢిల్లీ, మే 20 (అడుగు న్యూస్): హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణకు ముందడుగు పడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 50 శాతం చొప్పున ఖర్చు చేసే ప్రాతిపదికన ముందుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ప్రకటించారు. మూసీ ప్రక్షాళనకు కేంద్రం సహకరిస్తుందని, అమృత్ 2.౦ పథకం కింద రూ.3 వేల 975 కోట్లతో 39 ఎస్‌టీపీలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. దిల్లీలో జరిగిన సమావేశంలో హైదరాబాద్‌లో ప్రజా రవాణా, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల ప్రాజెక్టులపై సమీక్షించినట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణ, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలపై దిల్లీలో కేంద్రమంత్రులు మనోహర్‌లాల్ ఖట్టర్, కిషన్‌రెడ్డి సమీక్షించారు. సమావేశ వివరాలను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా వెల్లడించారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ ప్రాజెక్టుపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎల్ అండ్ టీ సంస్థ నుంచి మెట్రో రైల్‌ను ఇటీవలే టేకోవర్ చేసుకుంది. ఈ నేపథ్యంలో రెండో దశ పనులకు సంబంధించిన డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్), ఇతర సాంకేతిక వివరాలు మిగతా 2లో..

## నేటి నుంచి సరస్వతీ పుష్కరాలు

- తొలి పుష్కర స్నానం విజయేంద్ర సరస్వతిది
- హాజరు కానున్న గవర్నర్ శివప్రతాప్ శుక్లా
- భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలన్న సీఎం రేవంత్
- విస్తృతంగా ఏర్పాట్లు : మంత్రి కొండా సురేఖ



హైదరాబాద్, మే 20 (అడుగు న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలోని త్రివేణి సంగమం వద్ద మే 21వ తేదీ నుండి జూన్ 1వ తేదీ వరకు 12 రోజుల పాటు జరిగే సరస్వతీ అంత్య పుష్కరాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి మిగతా 3లో..

## ట్రంప్ దూకుడుకు సెనెట్ కళ్ళెం!

యుద్ధం ఎప్పుడూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కాదు. చర్చలు, దౌత్యం, పరస్పర గౌరవం ద్వారానే స్థిరమైన శాంతి సాధ్యమవుతుంది. ప్రపంచ దేశాలు ఇప్పుడు చేయాల్సింది ఆయుధాలకు పదును పెట్టడం కాదు, మౌనం వీడి శాంతి చర్చలకు పెదవులు విప్పాలి. ఆయా దేశాలపై శాంతి స్థాపనకు ఒత్తిడి తేవాలి. లేకపోతే పశ్చిమాసియాలో చెలరేగే మంటలు ప్రపంచాన్నే కాల్చివేసే ప్రమాదం ఉంది.

డా. మార్గం-అడుగు ఎడిటోరియల్ 2వ పేజీలో

సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..

## సంపాదకీయం
## మార్గం - అడుగు



### ట్రంప్ దూకుడుకు సెనెట్ కళ్లెం!

పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. అమెరికా అధ్యక్షుడు దోనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై సైనిక చర్యల హెచ్చరికలు జారీ చేయడం ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే ఉక్రెయిన్ యుద్ధం, గాజా సంక్షోభం, ఇంధన ధరల పెరుగుదలతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయంలో అమెరికా--ఇరాన్ ఉద్రిక్తతలు మరింత ప్రమాదకర పరిణామాలకు దారి తీసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ట్రంప్ యుద్ధ అధికారాలను పరిమితం చేసే తీర్మానానికి అమెరికా సెనెట్ ఆమోదం తెలపడం అంతర్జాతీయ రాజకీయాల్లో కీలక పరిణామంగా మారింది.

ఇరాన్ అణు కార్యక్రమం పేరుతో అమెరికా గత రెండు దశాబ్దాలుగా తీవ్ర ఒత్తిడి రాజకీయాలను కొనసాగిస్తోంది. అయితే ఇటీవలి ట్రంప్ వ్యాఖ్యలు మరింత ఉద్రిక్తతలకు కారణమయ్యాయి. "ఒప్పందం కుదరకపోతే భారీ దాడులు తప్పవు" అంటూ ట్రంప్ చేసిన ప్రకటన ప్రపంచ మార్కెట్లను కుదిపేసింది. మరోవైపు చర్చలు కొనసాగుతున్నాయని, అణ్వాయుధాలు లేకుండా ఉండే ఒప్పందానికి ఇరాన్ సిద్ధమైతే దాడుల అవసరం ఉండదని కూడా ఆయన పేర్కొన్నారు. అంటే ఒకవైపు శాంతి చర్చలు, మరోవైపు యుద్ధ హెచ్చరికలు అనే ద్వంద్వ వైఖరితో అమెరికా ముంచుకొస్తోంది.

ఈ దూకుడు ధోరణిపైనే అమెరికా సెనెట్‌లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. కాంగ్రెస్ అనుమతి లేకుండా అధ్యక్షుడు యుద్ధ చర్యలు చేపట్టకూడదని స్పష్టం చేస్తూ తీర్మానం చేసింది. అమెరికా రాజ్యాంగ వ్యవస్థలో ఇది అత్యంత ప్రాముఖ్యమైన అంశం. ఒక వ్యక్తి నిర్ణయంతో ప్రపంచాన్ని యుద్ధంలోకి నెట్టివేయకూడదనే ప్రజాస్వామ్య భావనకు ఇది ప్రతీక. ముఖ్యంగా ఇరాక్ యుద్ధం తర్వాత అమెరికాలో యుద్ధ వ్యతిరేక భావజాలం బలపడింది. 2003 ఇరాక్ యుద్ధానికి అమెరికా దాదాపు 2 ట్రిలియన్ డాలర్లకు పైగా ఖర్చు చేసినట్లు బ్రౌన్ యూనివర్సిటీ అధ్యయనాలు చెబుతున్నాయి. ఆ యుద్ధంలో లక్షలాది మంది ప్రాణాలు కోల్పోయారు. అయినా ఆ ప్రాంతంలో శాంతి నెలకొనలేదు. ఇదే పరిస్థితి మళ్లీ పునరావృతం కాకూడదనే ఆందోళన ఇప్పుడు వ్యక్తమవుతోంది.

ఇరాన్ కూడా వెనక్కి తగ్గే పరిస్థితిలో లేదు. అమెరికా--ఇజ్రాయెల్ చర్యలకు తాము తీవ్రంగా ప్రతిస్పందిస్తామని హెచ్చరిస్తోంది. తమ సాయుధ దళాలు గతంలో కంటే మరింత బలంగా ఉన్నాయని, యుద్ధానికి పూర్తిగా సిద్ధంగా ఉన్నామని టెహ్రాన్ ప్రకటిస్తోంది. ఇప్పటికే ఇరాన్ మద్దతుగల మిలీషియా గ్రూపులు ఇరాక్, సిరియా ప్రాంతాల్లో చురుకుగా ఉన్నాయి. పరిస్థితి అదుపుతప్పితే మొత్తం పశ్చిమాసియా యుద్ధరంగంగా మారే ప్రమాదం ఉంది.

ఈ సంక్షోభం ప్రభావం కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా తీవ్రంగా ఉండనుంది. ప్రపంచ చమురు సరఫరాలో 30 శాతం హోర్ముజ్ జలసంధి మార్గం ద్వారా జరుగుతుంది. ఇరాన్‌తో ఘర్షణలు పెరిగితే ఈ మార్గం దెబ్బతినే అవకాశం ఉంది. ఇప్పటికే ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 90 డాలర్ల దిశగా కదులుతున్నాయి. చమురు ధరలు పెరిగితే రవాణా, విద్యుత్, ఆహార ఉత్పత్తుల ధరలు పెరిగి ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం మరింత తీవ్రమవుతుంది. భారతదేశం వంటి దిగుమతులపై ఆధారపడే దేశాలకు ఇది పెద్ద సవాలుగా మారుతుంది. భారత్ తన చమురు అవసరాల్లో 85 శాతం దిగుమతులపైనే ఆధారపడుతోంది. అందువల్ల పశ్చిమాసియా అస్థిరత భారత ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది.

గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న లక్షలాది భారతీయుల భవిష్యత్తుపైనా అనిశ్చితి నెలకొనే ప్రమాదం ఉంది. గల్ఫ్ దేశాల్లో 90 లక్షలకుపైగా భారతీయులు ఉపాధి పొందుతున్నారు. యుద్ధ పరిస్థితులు తీవ్రరూపం దాల్చితే ఉపాధి, వాణిజ్యం, విదేశీ మారకద్రవ్య ప్రవాహాలపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఇప్పటికే గాజా యుద్ధం కారణంగా మధ్యప్రాచ్య వాణిజ్య మార్గాలు దెబ్బతిన్నాయి. ఈ పరిస్థితుల్లో అమెరికా--ఇరాన్ ఘర్షణ మరింత సంక్షోభాన్ని సృష్టించవచ్చు.

పర్యావరణ పరంగా కూడా ఈ యుద్ధ వాతావరణం ప్రమాదకరమే. చమురు శుద్ధి కేంద్రాలపై దాడులు, సముద్రాల్లో చమురు లీకులు జీవ వైవిధ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో ఇప్పటికే సముద్ర జీవవ్యవస్థపై ప్రభావం కనిపిస్తున్నట్లు పర్యావరణ సంస్థలు హెచ్చరిస్తున్నాయి. యుద్ధం కేవలం సరిహద్దులనే కాదు, ప్రకృతిని కూడా నాశనం చేస్తుంది.

ప్రపంచం ఇప్పుడు మరో పెద్ద యుద్ధాన్ని భరించే స్థితిలో లేదు. కరోనా మహమ్మారి తర్వాత ఇంకా అనేక దేశాలు ఆర్థికంగా కోలుకోలేదు. ఆహార సంక్షోభం, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఇలాంటి సమయంలో శక్తి ప్రదర్శనలు, యుద్ధ రాజకీయాలు మానవాళికి మేలు చేయవు. అమెరికా, ఇరాన్, ఇజ్రాయెల్ సహా అన్ని దేశాలు సంయమనం పాటించాల్సిన అవసరం ఉంది.

యుద్ధం ఎప్పుడూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కాదు. చర్చలు, దౌత్యం, పరస్పర గౌరవం ద్వారానే స్థిరమైన శాంతి సాధ్యమవుతుంది. ప్రపంచ దేశాలు ఇప్పుడు చేయాల్సింది ఆయుధాలకు పదును పెట్టడం కాదు, మౌనం వీడి శాంతి చర్చలకు పెదవులు విప్పాలి. ఆయా దేశాలపై శాంతి స్థాపనకు ఒత్తిడి తేవాలి. లేకపోతే పశ్చిమాసియాలో చెలరేగే మంటలు ప్రపంచాన్నే కాల్చివేసే ప్రమాదం ఉంది.

## ఫ్యూచర్‌లో డేటా సిటీ



**మొదటిపేజీ తరువాయి..**

హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కొత్త డేటా సెంటర్ల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను పరిశీలించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధిపై కూడా సీఎం ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ఫ్యూచర్ సిటీలో నెట్-జీరో విధానాలు అమలు చేయాలని, ప్రపంచ స్థాయి ఏఐ సదుపాయాలతో 'ఏఐ సిటీ'ని అభివృద్ధి చేయాలని సూచించారు. ఐటీ , డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో సరికొత్త ఎత్తుకు తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పీడ్ పెంచారు. ఎంసీఆర్ హెచ్ ఆర్ డీ లో జరిగిన పరిశ్రమలు, ఐటీ శాఖల రివ్యూ మీటింగ్‌లో రాష్ట్రంలో డిజిటల్ నెట్‌వర్క్, ఐటీ రంగాన్ని ద్వితీయ శ్రేణి నగరాలకు విస్తరించడంపై సీఎం కీలక నిర్ణయాలు తీసుకున్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలో ఏకంగా 1500 ఎకరాల భారీ విస్తీర్ణంలో ఒక సరికొత్త 'డేటా సిటీ'ని ఏర్పాటు చేయబోతున్నట్లు సీఎం ప్రకటన చేశారు. ఈ ప్రతిష్టాత్మక డేటా సిటీ నిర్వహణకు భారీగా నీటి అవసరాలు ఉంటాయని, అందుకోసం ప్యూర్ వాటర్ కాకుండా ఎస్ టీ పీ ల ద్వారా రీసైకిల్ చేసిన నీటిని వినియోగించేలా ఎ÷-లాన్ చేయాలని అధికారులకు సీఎం సూచనలు ఇచ్చారు. అలాగే గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్స్, పెద్ద పెద్ద డేటా సెంటర్ల ఏర్పాటు కోసం కరీంనగర్, వరంగల్, విజయవాడ రోడ్ల సమీపంలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను వెంటనే గుర్తించాలని ఆదేశించారు. కేవలం హైదరాబాద్‌లోనే కాకుండా ద్వితీయ శ్రేణి నగరాలలో కూడా ఈ జీసీసీల ఏర్పాటుపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టేలా సరికొత్త ఐటీ అండ్ ఇండస్ట్రియల్ పాలసీని తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా రాబోయే బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్ కోసం భూ సేకరణ పనులను తక్షణమే ప్రారంభించాలని సీఎం అధికారులను ఆదేశించారు. వీటితో పాటు రాష్ట్ర ప్రభుత్వ డిజిటల్ నెట్‌వర్క్ ప్రాజెక్ట్ అయిన టీ-ఫైబర్ పై సీఎం రేవంత్ రెడ్డి డెడ్‌లైన్ విధించారు. రాబోయే మూడు నెలల్లోగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు తప్పనిసరిగా నెట్‌వర్క్‌కు కనెక్ట్ కావాల్సిందేనని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన హెల్త్ క్లస్టర్ ను కూడా మన ఫ్యూచర్ సిటీకే వచ్చేలా చూడాలని, అవసరమైతే దీని కోసం తాను స్వయంగా ప్రధాని మోడీని కలిసి రిక్వెస్ట్ చేస్తానని సీఎం అధికారులతో పేర్కొన్నారు. అలాగే హెల్త్ సిటీ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. హెల్త్ సిటీ ప్రాజెక్టుకు కేంద్రప్రభుత్వ సహకారం కోసం చర్చలు జరపాలని సీఎం సూచించారు. కంపెనీలు భూమిపూజలకు సిద్ధంగా ఉండేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించే దిశగా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో కంపెనీలు ఎంఓయూలు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో ప్రత్యేక ఏజెన్సీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పెట్టుబడిదారులకు ఒకే వేదికపై అన్ని అనుమతులు అందించే విధానాన్ని తీసుకురావాలని సీఎం ఆదేశించారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న ఉత్తమ పారిశ్రామిక విధానాలను అధ్యయనం చేసి తెలంగాణలో అమలు చేయాలని అధికారులకు సూచించారు. అలాగే వచ్చే మూడు నెలల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు టీ-ఫైబర్ కనెక్టివిటీ కల్పించాలని ఆదేశించారు. టీ-ఫైబర్ ప్రాజెక్టుకు ఇప్పటికే రూ.54 కోట్లు విడుదలైనట్లు అధికారులు వెల్లడించారు.

## అవినీతిపై ఉక్కుపాదం

**మొదటిపేజీ తరువాయి..**

డిపోర్టమెంట్ లో ఎస్ ఐ నుంచి నాన్ క్యాడర్ ఐపీఎస్ వరకు ప్రమోషన్ తరవాత 2 ఏళ్ల పాటు ఇతర విభాగాల్లో పని చేయాలన్నారు. దీనిపైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి,డీజీపీ అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలన్నారు. సైబర్ క్రైమ్ నియంత్రణ పైన అధ్యయనం చేసి సమగ్ర నివేదిక తయారు చేయాలని అన్నారు. ఫోరెన్సిక్ సెంటర్స్,డేటా సెంటర్లని పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పోలీస్ ట్రైనింగ్ లోనే సైబర్ క్రైమ్ విభాగం లో పని చేయడం కోసం సెలక్షన్ జరగాలని సూచించారు. అన్ని విభాగాలు,ఉన్నతాధికారుల మధ్య సమన్వయం బాగా పెరగాలన్నారు. స్కిల్స్ యూనివర్సిటీ లో సైబర్ క్రైమ్ పైన పోలీస్ విభాగం కోసం ప్రత్యేక కోర్స్ ఏర్పాటు చేయాలన్నారు. విజిలెన్స్ విభాగంలో సాంకేతికతను పెంచాలి.. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే వారి పైన విజిలెన్స్ దృష్టి పెట్టాలి.. డేటా అనాలిస్ ఆధారంగా ఆర్గనైజ్ క్రైమ్ పైన విజిలెన్స్ విభాగం దృష్టి సారించాలి.. విజిలెన్స్ కు మరిన్ని అధికారాలు ఇచ్చే అంశం పైన అధ్యయనం చేయాలని అన్నారు. ప్రమాదం జరిగిన తర్వాత కాకుండా అగ్ని ప్రమాదాలు జరగకుండా ÷ర్ డిపా÷-టం÷-మెంట్ చర్యలు తీసుకోవాలి.. మునిసిపల్ డిపార్ట్‌మెంట్ ,హైడ్రాతో సమన్వయం చేసుకొన్ని ÷ర్ డిపోర్టమెంట్ పైన జూన్ 15 లోగా సమగ్ర నివేదిక సిద్ధం చేయాలన్నారు. నాల ల మెయింటెన్స్ లో మెట్రో వాటర్ వర్క్స్ విభాగం తో సమన్వయం చేసుకోవాలి. మ్యాన్ హోల్స్ నిర్వహణ పైన పోలీస్, ట్రాఫిక్ పోలీస్,హైడ్రా,మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగాలతో సమన్వయం చేసుకోవాలి నగరంలో అడ్డగోలుగా ఫెక్సీ లు కడుతుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు.పోలీస్ కమిషనర్ లు,జిహెచ్ ఎం సీ అధికారులు ఫెక్సీ లపైన కఠినంగా ఉండాలి.. నైట్ పెట్రోలింగ్ ను పెంచాలని అన్నారు.

## మెట్రో విస్తరణకు సిద్ధం

**మొదటిపేజీ తరువాయి..**

అందిన తర్వాత కేంద్ర ప్రభుత్వం సమగ్రంగా పరిశీలించి తదుపరి నిర్ణయం తీసుకుంటుందని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ తెలిపారు.హైదరాబాద్ మెట్రో రెండో దశ ప్రాజెక్టు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వానికి ఎటువంటి ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 50 శాతం చొప్పున ఖర్చు చేసే ప్రాతిపదికన ముందుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 162 కిలోమీటర్ల మేర మెట్రో రెండో దశ విస్తరణకు ప్రతిపాదనలు సమర్పించిందని, సానుకూలంగా పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని మనోహర్‌లాల్ ఖట్టర్ వెల్లడించారు.హైదరాబాద్‌లో మూసీ ప్రక్షాళనపైనా సమావేశంలో చర్చించారు. అమృత్ 2.ా పథకంలో భాగంగా మూసీ నదిలో కలుస్తున్న మురుగు నీటిని శుద్ధి చేసేందుకు మొత్తం 39 సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను (ఎస్‌టీపీ)లను మంజూరు చేశామని, ఈ ప్రాజెక్టు కోసం రూ.3 వేల 975 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ఖట్టర్ చెప్పారు. 39 ఎస్‌టీపీల ద్వారా రోజుకు 972 మిలియన్ లీటర్ల మురుగు నీటిని శుద్ధి చేసే సామర్థ్యం వస్తుందన్నారు. శుద్ధి చేయని మురికి నీరు నేరుగా మూసీ నదిలో కలవకుండా ఎస్‌టీపీలతో నిరోధించవచ్చన్నారు. మూసీ నది పరిరక్షణతో పాటు నగర పారిశుద్ధ్య మెరుగుదలకు ఇది ఎంతో దోహదం చేస్తుందని ఖట్టర్ తెలిపారు. హైదరాబాద్ మహానగర అభివృద్ధికి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకారం అందిస్తుందని అన్నారు. హైదరాబాద్ ప్రజల తరఫున కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్‌కు కృతజ్ఞతలు తెలిపినట్లు కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## రూపాయి విలువ పడిపోకుండా ఆర్బీఐ దిద్దుబాటు చర్యలు

న్యూఢిల్లీ,మే20(అడుగు న్యూస్): భారత కరెన్సీ రూపాయి రోజురోజుకూ క్షీణిస్తోంది. రూపాయితో డాలర్ మారకం విలువ 96ను దాటి పడిపోయింది. దీంతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రంగంలోకి దిగింది. ఆర్బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. బ్యాంకింగ్ వ్యవస్థలోకి నగదు లభ్యతను పెంచడానికి 5 బిలియన్ డాలర్ల విలువైన డాలరు - రూపాయి బై, సెల్ స్వాప్ వేలాన్ని చేపట్టనుంది. మే 26వ తేదీన వేలం ప్రక్రియ చేపట్టనున్నట్లు వెల్లడించింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో రూపాయి విలువ పతనమవుతోంది. దీంతో బై, సెల్ స్వాప్ వేలం నిర్ణయం తీసుకుంది. పరిస్థితులకు అనుగుణంగా మూడేళ్ల కాలపరిమితితో రూపాయి - డాలర్ బై, సెల్ స్వాప్ వేలాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆర్బీఐ తెలిపింది.

## ఎఫ్ఆర్బీఎం మినహాయించండి

**మొదటిపేజీ తరువాయి..**



పరిమితి నుండి మినహాయింపు ఇవ్వాలని కోరారు. అలాగే సాస్కీ పథకం కింద రూ. 5,000 కోట్ల ప్రత్యేక అదనపు ఆర్థిక సాయాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో జరిగిన సమావేశంలో.. సింగరేణి సంస్థ భవిష్యత్ ప్రణాళికలు, బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులపై చర్చించారు. బొగ్గును కేవలం విద్యుత్ ఉత్పత్తికే కాకుండా, ఆధునిక సాంకేతికతతో గ్యాసిఫికేషన్ ప్రక్రియ ద్వారా విలువ ఆధారితంగా మార్చేందుకు సింగరేణి సిద్ధంగా ఉందని, ఇందుకు కేంద్రం విధానపరమైన సహకారం అందించాలని కోరారు. దీంతో పాటు రాష్ట్ర ఇంధన భద్రతకు కీలకమైన కొయ్యగూడెం బ్లాక్-×××ను సింగరేణికి కేటాయించాలని, తాడిచెర్ల కోల్ బ్లాక్-×× మైనింగ్ లీజ్ ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన కిషన్ రెడ్డి.. త్వరలోనే అధికారులు, సింగరేణి ప్రతినిధులతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

## కులగణన తప్పనిసరే

న్యూఢిల్లీ,మే20(అడుగు న్యూస్): కులగణనపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. జనగణనలో కులాల లెక్కింపునకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌తో కూడిన ధర్మాసనం అనుమతి ఇచ్చింది. కులగణనను వ్యతిరేకిస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని ధర్మాసనం కొట్టివేసింది. ఈ మేరకు బుధవారం జస్టిస్ సూర్యకాంత్‌తో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించారు. సంక్షేమ పథకాల అమలుకు కులగణన తప్పనిసరి అని స్పష్టం చేసింది. కుల గణన ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని పేర్కొంది. ఈ అంశంలో కోర్టుల జోక్యం ఉండదని స్పష్టం చేసింది. జన గణన.. కుల ప్రాతిపదికన జరగాలా వద్దా అనేది విధానపరమైన నిర్ణయమని పేర్కొంది. వెనుకబడిన తరగతికి చెందిన వారు ఎంతమంది ఉన్నారో ప్రభుత్వం తెలుసుకోవాల్సి ఉందని ఈ ధర్మాసనం వ్యాఖ్యానించింది. నగణన నుంచి కులగణనను మినహాయించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని ఈ సందర్భంగా ధర్మాసనం తిరస్కరించింది. ఈ అంశం ప్రభుత్వ విధాన పరిధిలోకి వస్తుందని వివరించింది. అందులో న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేవని తెలిపింది.

## రానున్న 4 రోజుల్లో మరింత తీవ్రం

- 47 డిగ్రీలు కూడా దాటే అవకాశం
- తీవ్రంగా వీయనున్న వడగాల్పులు
- మధ్యాహ్న ప్రయాణాలు వద్దు : సీఎం
- కలెక్టర్లను అప్రమత్తం చేసిన రేవంత్

హైదరాబాద్,మే20(అడుగు న్యూస్): తెలుగు రాష్ట్రాల్లో భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. రెండు రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌లోని పిడుగురాళ్లలో 47.6 డిగ్రీలు, తెలంగాణలోని నిర్మల్‌లో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యాయి. తెలంగాణలోని 19 జిల్లాల్లో 46 డిగ్రీలకు పైగా, ఏపీలోని 11 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయినట్లు అధికారులు తెలిపారు. తెలంగాణలోని హన్మకొండలో 46.4, జగిత్యాలలో 46.3, ఆదిలాబాద్‌లో 46.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏపీలో కృష్ణా జిల్లాలోని కంకిపాడు, మార్కాపురంలోని నందనమారెళ్ల, 46.1 డిగ్రీలు, తణుకులో 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రానున్న నాలుగు రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరుగుతుందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. తీవ్రమైనవడ గాలులు, ఎండ తీవ్రతపైవాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలోప్రజలంతాఅప్రమత్తంగాఉండాలనిముఖ్యమంత్రిఎ.రేవంత్ రెడ్డి సూచించారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండ తీవ్రతఎక్కువగాఉండనున్నందున ఆయా జిల్లాల అధికారులు అవసరమైన జాగ్రత్తలుతీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు తగినసంఖ్యలో అందుబాటులో ఉంచాలని, తాగు నీరు, విద్యుత్ సరఫరాపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని సీఎం ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మొదలు జిల్లా ఆసుపత్రుల వరకువైద్యారోగ్య సిబ్బంది అప్రమత్తంగాఉండాలని, వడదెబ్బతో ఎవరైనా ఆసుపత్రుల్లో చేరితే తగిన వైద్య సహాయంఅందించాలని సీఎం ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం ప్రయాణాలు చేయకుండా ఉండాలని సీఎం సూచించారు. ఆయా జిల్లాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ కలెక్టర్లకు దిశానిర్దేశర చేయాలని రాష్ట్ర ప్రభుత్వప్రధానకార్యదర్శిరామకృష్ణారావును సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

## చచ్చినా కాషాయాన్ని వీడను

**మొదటిపేజీ తరువాయి..**

బండి సంజయ్ తీవ్రంగా స్పందించారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కార్యకర్తల ఘన స్వాగతం మధ్య ఆయన మీడియాతో మాట్లాడారు. తాను చనిపోయాక తన శవంపై కాషాయ జెండా కప్పాలన్నదే తన చివరి కోరికని, బీజేపీలో నిబద్ధతతో పనిచేసే ఏ కార్యకర్త అయినా ఇదే కోరుకుంటారని ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. పదేళ్ల బీఆర్ఎస్ గడీల పాలనను బద్దలు



కొట్టిన కక్షతోనే కొందరు పనిగట్టుకుని తనపై ఇలాంటి దుష్ప్రచారం చేస్తున్నారని బండి సంజయ్ మండిపడ్డారు. బహుశా బీఆర్ఎస్ ఎంపీల మద్దతుతోనే కేంద్ర ప్రభుత్వం నడుస్తోందేమో, అందుకే కేసీఆర్, కేటీఆర్ నన్ను మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని నిర్ణయించి ఉంటారు అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఇలాంటి ఫేక్ గాళ్ల ఆరోపణలపై స్పందించాల్సిన అవసరం తనకు లేదన్నారు. అలాగే తన కుమారుడు భగీరథ్‌పై వచ్చిన ఆరోపణల గురించి ప్రస్తావిస్తూ.. ఆ కేసు ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందని, విచారణ కోసం తానే స్వయంగా తన కొడుకును పోలీసులకు అప్పగించానని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో తనపై ఎంత విషప్రచారం చేసినా, ప్రజలు ఎప్పటికీ బీజేపీ వైపే ఉంటారని బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు.

సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..

## బ్యాంక్ మంజూరు

పాలకుర్తి, మే 20 (అడుగు న్యూస్): జనగామ జిల్లా, పాలకుర్తి మండలం, గూడూరు గ్రామానికి యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ మంజూరు కావడంతో గ్రామ సర్పంచ్ మాచర్ల స్వరూపపుల్లయ్య ఆనందం వ్యక్తం చేశారు. బ్యాంక్ బ్రాంచ్ కోసం ఆయన వారు చేసిన కృషి ఫలించిందన్నారు. ఈ సందర్భంగా హనుమకొండ రీజినల్ కార్యాలయానికి వెళ్లి రీజినల్ ఆఫీసర్లు కమలాకర్ గంటి, విజయకుమార్‌లను శాలువాతో సత్కరించి బొకే అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుగ్గిళ్ల కళ్యాణ్, మాజీ ఉపసర్పంచ్ అనుముల మహేందర్, పూజారి ఉమా మహేష్, కొండపర్తి విష్ణుమూర్తి, మద్ద రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం దిగుమతిని వేగవంతం చేయాలి

పాలకుర్తి, మే 20 (అడుగు న్యూస్): జనగామ జిల్లా, పాలకుర్తి మండలంలోని ఐకేపీ కేంద్రాల్లో లారీల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం నాయకులు చిట్యాల సోమన్న, సోమసత్యం ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం తహసీల్దార్ ఎస్.సరస్వతికి వినతిపత్రం అందజేసి అదనపు లారీలను కేటాయించాలని కోరారు. రైస్ మిల్లర్లు బస్తాకు 2 నుంచి 3 కిలోల ధాన్యం తరుగు పేరిట దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. రైతుల సమస్యలు పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వేల్పుల కొమురయ్య, జిట్టబోయిన కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి సాయం

పాలకుర్తి, మే 20 (అడుగు న్యూస్): జనగామ జిల్లా, పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన నమోజు వీరాచారి మృతితో ఆయన కుటుంబాన్ని అమ్మ ట్రస్ట్ సభ్యులు పరామర్శించారు. ట్రస్ట్ చైర్మన్ యతిపతి శ్రీకాంత్ ఆధ్వర్యంలో 25 కేజీల బియ్యం, నిత్యావసరాలు, కూరగాయలు అందజేశారు. కార్యక్రమానికి సహకరించిన దేవగిరి సౌజన్య అనిల్ శర్మకు కృతజ్ఞతలు తెలిపారు. ఒర్రె కుమారస్వామి, జీడి సమ్మయ్య పాల్గొన్నారు.

## సరస్వతి అంత్య పుష్కరాల ఆహ్వానం

జనగామ, మే 20 (అడుగు న్యూస్): శ్రీ సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా దేవాదాయ ధర్మాదాయ



శాఖ ఆధ్వర్యంలో నల్గొండ అసిస్టెంట్ కమిషనర్, పాలకుర్తి ఈవో లక్ష్మి ప్రసన్న బుధవారం జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో చిల్పూర్ గుట్ట ముఖ్య అర్చకుడు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, మహేష్, రాజేందర్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి అడ్లూరిని కలిసిన ఝాన్సీ

హైదరాబాద్, మే 20 (అడుగు న్యూస్): హైదరాబాద్‌లో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ



మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, సంక్షేమ కార్యక్రమాల అమలుపై చర్చించారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె కోరారు.

## నేడు తమిళనాడు కేబినేట్ విస్తరణ

చెన్నై,మే20(అడుగు న్యూస్): దాదాపు 59 సంవత్సరాల సుదీర్ఘ విరామం తరువాత కాంగ్రెస్ పార్టీ తమిళనాడు మంత్రివర్గంలోకి అడుగుపెడుతోంది. ముఖ్యమంత్రి విజయ్ సారథ్యంలోని టీవీకే ప్రభుత్వం గురువారం నాడు మంత్రివర్గ విస్తరణ సిద్ధమవుతోంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజేష్ కుమార్, పి.విశ్వనాథన్ లు క్యాబినెట్ మంత్రులుగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలియజేశారు. 'ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆమోదంతో పార్టీ ఎమ్మెల్యేలు అడ్వకేట్ రాజేష్ కుమార్, పి.విశ్వనాథ్‌లు విజయ్ సారథ్యంలోని తమిళనాడు క్యాబినెట్‌లో మంత్రులుగా గురువారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఇది మాకు ఒక చారిత్రక సందర్భం. 59 ఏళ్ల సుదీర్ఘ విరామం తరువాత కాంగ్రెస్ పార్టీ తమిళనాడు క్యాబినెట్‌లో చేరుతోంది. ప్రభుత్వంలో చేరుతున్న మా ఎమ్మెల్యేలు ఇద్దరికీ అభినందనలు. తమిళనాడు ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చి, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ నిర్దేశిరచిన సంక్షేమ, ప్రజానుకూల ప్రభుత్వ విజన్‌ను సాకారం చేస్తారని ఆశిస్తున్నాం' అని ఆ పోస్టులో కేసీ వేణుగోపాల్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ దశాబ్దాలుగా ద్రవిడ పార్టీలకు జూనియర్ భాగస్వామిగా ఉంటూ వచ్చింది. సుదీర్ఘ కాలంగా డీఎంకేతో పొత్తు సాగించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వామ్యం కాకుండా పరోక్షంగా మద్దతు కొనసాగస్తూ వచ్చింది. ఇటీవల ఎన్నికల అనంతర రాజకీయ పరిణామాల నేపథ్యంలో డీఎంకే పార్టీతో పొత్తుకు ఉద్వాసన చెప్పి విజయ్ టీవీకే ప్రభుత్వం ఏర్పాటు కోసం ఆ పార్టీతో జతకట్టింది.

# మైనింగ్‌పై ఉపాధి కూలీల ఆగ్రహం

### తక్షణమే నిలిపివేయాలని డిమాండ్!

దేవరుప్పుల, మే 20 (అడుగు న్యూస్): జనగామ జిల్లా, దేవరుప్పుల మండలంలో ప్రముఖ





ఆధ్యాత్మిక క్షేత్రమైన శ్రీ వాన కొండయ్య లక్ష్మీనరసింహస్వామి గుట్టపై జరుగుతున్న మైనింగ్ (క్వారీ) పనులను తక్షణమే నిలిపివేయాలని స్థానిక ఉపాధి హామీ కూలీలు, భక్తులు తీవ్రస్థాయిలో డిమాండ్ చేస్తున్నారు. తరతరాలుగా తమ ఇలవేల్పుగా పూజలందుకుంటున్న దేవుడి గుట్టను లాభాల కోసం మైనింగ్ మాఫియాకు ధారాదత్తం చేయడం సరికాదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పనుల వద్ద కూలీలు సమావేశమై తమ ఆవేదనను పంచుకున్నారు. మైనింగ్ కోసం జరిపే భారీ పేలుళ్ల (బ్లాస్టింగ్స్) ధాటికి చుట్టుపక్కల ఇళ్లు బలహీనపడుతున్నాయని, భవిష్యత్తులో పురాతన ఆలయ నిర్మాణానికి సైతం ముప్పు వాటిల్లే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి తోడు, క్వారీ పనుల వల్ల వెలువడే విపరీతమైన దుమ్ము, ధూళి కారణంగా చుట్టుపక్కల వాతావరణం పూర్తిగా కలుషితమవుతోందని కూలీలు ఆరోపించారు. దీనివల్ల సమీపంలోని పంటపొలాలు దెబ్బతినడమే కాకుండా, పనులకు వచ్చే వందలాది మంది కూలీలు తీవ్ర శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాన కొండయ్య గుట్ట మా ప్రాంత సంస్కృతికి, నమ్మకానికి ప్రతీక. ప్రాణాలైనా ఇస్తాం కానీ దేవుడి గుట్టను నాశనం కానివ్వం అని కూలీలు హెచ్చరించారు. ప్రజా భావోద్వేగాలను, పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి, ఈ మైనింగ్ అనుమతులను తక్షణమే రద్దు చేయాలని వారు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు.

## నేటి నుంచి సరస్వతీ పుష్కరాలు

మొదటిపేజీ తరువాయి..

ఎ. రేవంత్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. మే 21 తెల్లవారుజామున 5:43 గంటలకు కంచి పీఠాధిపతి జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ మరియు రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పుష్కర స్నానమాచరించి ఈ వేడుకలను లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ పుష్కరాలకు దాదాపు 30 నుండి 40 లక్షల మంది భక్తులు, 1.70 లక్షల వాహనాలు వచ్చే అవకాశం ఉందని అంచనా వేసిన ప్రభుత్వం రూ. 30.63 కోట్ల నిధులతో పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. ప్రస్తుత వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని భక్తుల కోసం చలువ పందిళ్లు, కాయర్ మ్యాట్లు, ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు మరియు తాగునీటి సదుపాయాలను విస్తృతంగా కల్పించారు. భక్తుల రక్షణ కోసం 100 మంది నిపుణులైన గజ ఈతగాళ్లు, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలను మోహరించడంతో పాటు భద్రత దృష్ట్యా 200 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. రవాణా సౌకర్యం కోసం 90 షటిల్ బస్సులు, 245 ఎకరాల్లో 23 పార్కింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. అత్యవసర వైద్య సేవల కోసం 300 మంది సిబ్బందితో 23 మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసినట్లు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఈ 12 రోజుల పాటు ప్రతిరోజూ ఉదయం హోమాలు, సాయంత్రం ప్రత్యేక గోదావరి హారతి, తెప్పోత్సవం మరియు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



## మెలోనీకి మో(లో)డీ!

మొదటిపేజీ తరువాయి..

కార్యాచరణ ప్రణాళిక 2025-29' గురించి మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇది ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలకు ఒక ఆచరణాత్మక, భవిష్యత్ ఆధారిత నిర్మాణాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. ఇరుదేశాల నాయకుల మధ్య పెరుగుతున్న నిరంతర చర్చలు, సమావేశాలు ఇరుపక్షాల మధ్య బలపడుతున్న సహకారానికి, పరస్పర నమ్మకానికి నిదర్శనమని మోదీ అన్నారు."సాంకేతికత, ఆవిష్కరణలు మా భాగస్వామ్యానికి చోదక శక్తులు. కృత్రిమ మేధ (ఏఐ), క్వాంటం, పౌర అణు ఇంధనం (సివిల్ న్యూక్లియర్ ఎనర్జీ), అంతరిక్ష రంగాల్లో మా భాగస్వామ్యానికి అపరిమితమైన అవకాశాలు ఉన్నాయి. ఇరుదేశాల్లోని స్టార్టప్‌లు, పరిశోధనా కేంద్రాలు, వ్యాపారాలను అనుసంధానించడానికి మేము భారత్-ఇటలీ ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటుపై పనిచేస్తున్నాం" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. గడచిన మూడున్నర ఏళ్లలో తనకు, ఇటలీ ప్రధాని మెలోనీతో పలుమార్లు సమావేశం అయ్యే అవకాశం వచ్చిందని మోదీ పేర్కొన్నారు. "ఇది భారత్-ఇటలీ మధ్య ఉన్న సన్నిహిత సహకారానికి, సయోధ్యకు ప్రతిబింబం. ఆమె నాయకత్వంలో మన ఇరుదేశాల సంబంధాలు సరికొత్త వేగాన్ని, నూతన దిశను, ఆత్మవిశ్వాసాన్ని సంతరించుకున్నాయి. మా సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తూ, ఈ ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించడం నాకు ఎంతో ఆనందాన్ని ఇస్తోంది" అని మోదీ అన్నారు. భారత్-ఇటలీ మధ్య ఉన్న నాగరికతా సంబంధాలను కూడా మోదీ హైలెట్ చేశారు. ఇరుదేశాల మధ్య ఉన్న సంబంధాలు కేవలం ఇప్పటివి కావని అన్నారు. ఇటలీ రాజధాని రోమ్ నగరానికి, తన పార్లమెంటరీ నియోజకవర్గమైన వారణాశి (కాశీ)కి మధ్య ఉన్న చారిత్రక అనుబంధాన్ని ప్రధాని మోదీ గుర్తుచేశారు. "నాకు, నా ప్రతినిధి బృందానికి ఘన స్వాగతం పలికినందుకు నేను ప్రధాని మెలోనీకి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ప్రపంచంలో రోమ్ నగరాన్ని శాశ్వత నగరం అని పిలుస్తారు. భారతదేశంలో నా లోక్‌సభ నియోజకవర్గమైన కాశీ కూడా శాశ్వత నగరమే. ఈ రెండు గొప్ప నాగరికతలు కలిసినప్పుడు, చర్చలు కేవలం ఒక ఎజెండాకే పరిమితం కావు. అందులో లోతైన చరిత్ర, భవిష్యత్తు వీక్షణం, నిరాండర స్నేహం స్పష్టంగా కనిపిస్తాయి" అని మోదీ పేర్కొన్నారు. ప్రధాని తన ఐదు దేశాల పర్యటనలో భాగంగా నార్వే, స్వీడన్, నెదర్లాండ్స్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)ల్లో పర్యటించారు. చివరిగా మంగళవారం నాడు ఇటలీ పర్యటనకు వెళ్లారు. ఇటలీ చేరుకున్న ప్రధాని మోదీకి రోమ్‌లో సైనిక వందనం చేస్తూ ఘన స్వాగతం పలికారు. రోమ్ చేరుకున్న వెంటనే ఆయన ఇటలీ ప్రధాని జార్జియా మెలోనితో ప్రత్యేక విందులో పాల్గొన్నారు. అనంతరం ఇరువురు నేతలు రోమ్‌లోని ప్రఖ్యాత చారిత్రక కట్టడం 'కొలోసియం'ను సందర్శించారు. తర్వాత ఇరుదేశాల నేతలు సమావేశమై వాణిజ్యం, రక్షణ, క్లీన్ ఎనర్జీ, సాంకేతిక రంగాలపై ప్రత్యేకంగా చర్చలు జరిపారు.

## మోదీ, షాలు దేశాన్ని అమ్మేశారు

మొదటిపేజీ తరువాయి..

మహాత్మా గాంధీ సిద్ధాంతాలకు సజీవ రూపమని తెలిపారు. మహనీయులను స్మరించుకుంటున్నామే తప్ప, వారు నమ్మిన సిద్ధాంతాలను సరిగ్గా కాపాడుకోలేకపోతున్నామని చెప్పారు. మహనీయుల విగ్రహాల ముందు తలలు వంచడం పెద్ద ఫ్యాషన్‌గా మారిందని, కానీ అదే మహనీయులు రాసిన రాజ్యాంగంపై, వారు నమ్మిన సిద్ధాంతాలపై దాడులు జరుగుతుంటే మాత్రం అందరూ మౌనంగా ఉంటున్నారని మండిపడ్డారు. రాజ్యాంగంపై ప్రధాని మోదీ రోజు దాడి చేస్తూనే ఉన్నారని ఆరోపించారు. ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరచడం, దేశంలో కుల గణన చేపట్టకపోవడం ఇందులో భాగమేనన్నారు. దేశ ప్రయోజనాలను పణంగా పెట్టి అంబానీ, అదానీ వంటి పెద్ద పారిశ్రామికవేత్తల ప్రయోజనాలకే కేంద్ర ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇస్తోందని రాహుల గాంధీ దుయ్యబట్టారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విదేశాలకు వెళ్లొద్దు, బంగారం కొనొద్దు, ఎలక్ట్రిక్ వాహనాలు కొనండి అని చెప్తున్నారు. ఆయనే స్వయంగా వేల కోట్ల రూపాయల విలువైన విమానాల్లో విదేశీ పర్యటనలకు వెళ్తున్నారు. రాబోయే రోజుల్లో రైతులకు ఎరువులు కూడా దొరకని పరిస్థితి రానుంది. ఆర్థిక తుపాను రాబోతుంది. మీరే చూడండి. రానున్న కొద్ది నెలల్లో ద్రవ్యోల్బణం ఎక్కడికి చేరుతుందో. పెట్రోల్, డీజిల్, గ్యాస్, పప్పుధాన్యాలు, బియ్యం ధరలు ఎక్కడికి చేరుతాయో మీరే చూడండి. ఎన్నికలకు ముందు దేశంలో పెట్రోల్, గ్యాస్ కొరత ఏమీ లేదని ప్రధాని చెప్పారు. పెట్రోల్ ధరలు పెరగవన్నారు. ఈరోజు పెట్రోల్ ధరలు పెరుగుతుంటే అంబానీ మాత్రం భారతదేశం నుంచి విదేశాలకు పెట్రోల్‌ను ఎగుమతి చేస్తున్నారు. అంబానీ రష్యా నుంచి పెట్రోల్‌ను కొనుగోలు చేసి విదేశాల్లో విక్రయిస్తున్నారు. ఆ డబ్బుతోనే ప్రధానికి నిధులు సమకూరుస్తున్నారని అన్నారు. మరోవైపు ఇటలీ ప్రధాన మంత్రి జార్జియా మెలోనికి ప్రధాని మోదీ మెలోడి చాక్లెట్లు ఇవ్వడంపైనా రాహుల్ స్పందించారు. ప్రజల రక్షణ కోసం చర్యలు తీసుకోవాల్సిన ఆయన, ఇటలీ ప్రధానితో చాక్లెట్లు తిని వీడియోలు తీశారని ఎద్దేవా చేశారు. అమేఠీలో నిర్వహించిన సభలో మాట్లాడిన ఆయన ఈ మేరకు ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. "మనకు చమురు హర్మూజ్ జలసంధి గుండా వస్తుంది కానీ ఇప్పుడు దానిని మూసివేశారు. అయినా, ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలకు ముందు చమురు, గ్యాస్, పెట్రోల్ కొరత లేదని, అంతా బాగానే ఉందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. గత రెండు నెలలుగా పార్లమెంటులోనూ, ప్రసంగాల్లోనూ ఒక ఆర్థిక తుఫాను రాబోతోందని నేను నెలల తరబడి చెబుతూనే ఉన్నాను.




## గా అల్లునికి గీ మామ వెండి శెప్పులు!?

అభిమానానికి కూడా హద్దులుండాలంటరు. కనీ, కొందరు సూపే పేమకు హద్దులుండయి. ఎవలికి తోచిన విధంగా వాళ్ళు తమకిట్టమైన వాల్ల మీద అభిమానం సూపుతరు. గట్లనే గీ మామ, తన అల్లుడి సూపిన ముచ్చట.. తెగ వైరలైతాంది.



ఎవలకైనా బిడ్డంటే పానముంటది. కనీ గీ మామ తన బిడ్డను బాగా సూసుకుంటడని అనుకున్నడేమో గనీ, తన అల్లుడి మీద పానం శేసిండు. మహారాష్ట్రకు చెందిన గీ మామ, తన అల్లునికి ఏకంగా వెండి శెప్పులు శేయించిండు. ఏదో పిసరి పితుకంత కాదుల్లా... ఏకంగా కిలోన్నర వెండితోటి! మల్ల గది గూడ కొల్హాపురి శెప్పుల్లెక్క!! మంచిగ శేయించి కానుకగ ఇచ్చిండు. గదే గా కొల్హాపూర్ లోని పేరున్న విక్రాంత్ అనే ఒకాయినె గా వెండి శెప్పులను తయారు శేయడానికి ఎనిమిది రోజులు శమ పడ్డడట!

## ట్రంప్‌కు కళ్లెం!

మొదటిపేజీ తరువాయి..

అనేకసార్లు సెనెట్‌లో ఓటింగ్ నిర్వహించారు. అయితే, వారి తీర్మానాలకు తగినంత ఓటింగ్ లభించలేదు. డెమోక్రటిక్ సెనెటర్ టిమ్ కెయిన్ తాజాగా మరోసారి సెనెట్ ముందుకు తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. యుద్ధ ప్రకటన, సైనిక చర్యకు కాంగ్రెస్ నుంచి స్పష్టమైన ఆమోదం లభిస్తే తప్ప.. ఇరాన్ లోపల లేదా దానికి వ్యతిరేకంగా జరిగే ఘర్షణల్లో యూఎస్ దళాలు పాల్గొనకూడదని అందులో తెలిపారు. దీనికి 50 మంది అనుకూలంగా.. 47 మంది వ్యతిరేకంగా ఓట్లు వేశారు. ఈ తీర్మానం ఆమోదంలో నలుగురు రిపబ్లికన్ సభ్యులు కూడా మద్దతుగా ఓటు వేయడం గమనార్హం. కాగా.. ఈ బిల్లు ఆమోదానికి సంబంధించి త్వరలో తుది ఓటింగ్ జరగనుంది. ఇది చట్టంగా మారితే.. కాంగ్రెస్ అధికారికంగా సైనిక దాడి కొనసాగించడానికి అనుమతి ఇచ్చేవరకు ట్రంప్ ఇరాన్‌పై ఎలాంటి దాడులకు దిగకూడదు. ఓటింగ్ సందర్భంగా డెమోక్రటిక్ సెనెట్ చక్ షుమర్ మాట్లాడుతూ.. యుద్ధానికి సంబంధించిన నిర్ణయాలపై కాంగ్రెస్ తిరిగి పర్యవేక్షణ చేపట్టాలన్నారు. 'ఈ అధ్యక్షుడు నిండుగా తూటాలున్న తుపాకీతో ఆడుకుంటున్న చిన్నపిల్లాడిలా ఉన్నాడు' అని వ్యాఖ్యానించారు. అమెరికా- ఇరాన్ మధ్య శాంతి ఒప్పందానికి సంబంధించిన చర్చలు కొనసాగుతోన్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## భారత్ కు పుతిన్, జిన్‌పింగ్


మొదటిపేజీ తరువాయి..

మెండుగా ఉన్నాయని తెలుస్తోంది. అయితే, చైనా అధికారికంగా ఇంకా ఎలాంటి ప్రకటనా విడుదల చేయలేదు. జిన్‌పింగ్ భారత పర్యటనపై ఇప్పటికే అంతర్జాతీయంగా ఆసక్తి నెలకొంది. 2019లో జిన్‌పింగ్ భారత్‌లో పర్యటించారు. ఆ తరువాత 2020లో గాల్వాన్ లోయలో ఇరు దేశాల మధ్య తలెత్తిన ఘర్షణలు, 2022లో తవాంగ్ బోర్డర్ వద్ద ఉద్రికత్తల కారణంగా కొంతకాలం పాటు పరిస్థితులు గంభీరంగా మారాయి. ఆ తరువాత రష్యాలో కజాన్ వేదికగా జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో మోదీ, జిన్‌పింగ్‌లు సమావేశమయ్యారు. భౌగోళిక రాజకీయాలు, ఇరాన్ యుద్ధం విషయంలో బ్రిక్స్ కూటమిలో భేదాభిప్రాయాలు నెలకొన్నాయన్న వార్తల నడుమ తాజా సమావేశాలకు రష్యా, చైనా అధినేతలు హాజరుకానున్నారు. ఇటీవల జరిగిన బ్రిక్స్ విదేశాంగ శాఖ మంత్రులు, ప్రతినిధుల సమావేశంలో భేదాభిప్రాయాల కారణంగా దేశాల సంయుక్త ప్రకటన ఏదీ వెలువడలేదు.

## మెటాలో భారీగా ఉద్యోగుల తొలగింపు

### వర్క్‌ఫ్రమ్ హోమ్ అంటూనే సడన్‌గా లేఆఫ్స్

న్యూఢిల్లీ,మే20(అడుగు న్యూస్): ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటాలో ఉద్యోగ తొలగింపులు ప్రారంభమయ్యాయి. సంస్థ తొలుత తమ ఉద్యోగులకు వర్క్‌ఫ్రమ్ హోమ్ చేయాలని చెప్పి.. సడన్‌గా లేఆఫ్ మెయిల్స్ పంపినట్లు తెలుస్తోంది.



ప్రస్తుతం ఈ విషయం నెట్టింట తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సింగపూర్, యూఎస్, యూకే వంటి ప్రాంతాల్లోని ఉద్యోగులకు తొలుత ఇంటినుంచే పని చేయాలని కంపెనీ తెలిపింది. అందుకు వారు సిద్ధమవుతుండగా.. సరిగ్గా తెల్లవారుజామున ప్రభావిత ఉద్యోగులకు లేఆఫ్ మెయిల్స్ పంపింది. ఎలాంటి గందరగోళం జరగకుండా ఉండేందుకు సంస్థ ఇలాంటి చర్యలు తీసుకున్నట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఈ చర్యపై నెట్టింట తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక, మెటా తన సింగపూర్‌లోని టీమ్‌కు తొలుత ఈ మెయిల్స్ పంపించింది. ఉదయం 4 గంటలకు భారత కాలమానం ప్రకారం తెల్లవారుజామున 1:30 గంటలకు వారికి అవి అందాయి. ఈ తొలగింపులకు ముందు ప్రపంచవ్యాప్తంగా మెటాలో దాదాపు 78 వేల మంది ఉద్యోగులు ఉన్నారు. తాజాగా 10 శాతం అంటే.. దాదాపు 8,000 మందిని ఉద్యోగం నుంచి తొలగించనుంది. ఇందులో ఎక్కువగా ఇంజినీరింగ్, ప్రొడక్ట్ బృందాలు ప్రభావం కానున్నట్లు తెలుస్తోంది. కాగా.. ఈ ఏడాది చివర్లో కంపెనీ మరికొన్ని తొలగింపులు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. 7వేల మందిని ఏఐ విధుల్లోకి మార్చనున్నట్లు మెటా హెచ్‌ఆర్ చీఫ్ జానెలె గేల్ ఇప్పటికే తెలిపారు.

సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..

# ఆటలు

## లఖ్‌నవూ బౌలర్‌పై సునీల్ గావస్కర్ విమర్శలు!

గతమ్యాచ్‌లో నోట్ సెలబ్రేషన్స్‌తో అందరి దృష్టిని ఆకర్షించిన లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ బౌలర్ ఆకాశ్ సింగ్ తాజాగా రాజస్థాన్ రాయల్స్‌పై తేలిపోయాడు. ఈ మ్యాచ్‌లో మూడు ఓవర్లు బౌలింగ్ చేసి 1 వికెట్ పడగొట్టి 57 పరుగులు ఇచ్చాడు. దీంతో అతడిపై మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ విమర్శలు చేశాడు. ఆ చీటీ ఇప్పుడు ఎక్కడికి పోయిందంటూ ఫైర్ అయ్యాడు. అయితే ఆకాశ్ ఇటీవల చెన్నై సూపర్ కింగ్స్‌తో మ్యాచ్‌లో అదరగొట్టాడు. 3 వికెట్లు తీసి లఖ్‌నవూ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ క్రమంలో తొలి వికెట్ పడగొట్టిన తర్వాత జేబులో నుంచి చీటీ తీసి కెమెరాకు చూపించాడు. ఇలా నోట్ సంబరాలతో వైరల్ అయ్యాడు. ఇక తాజా మ్యాచ్‌లోనూ ఫ్యాన్స్ అలాంటి ప్రదర్శనే ఆశించారు. కానీ, ఇక్కడ ఆకాశ్ బౌలింగ్ తేలిపోయింది. దారాళంగా పరుగులు ఇచ్చాడు. దీంతో కామెంటరీ బాక్స్‌లో ఉన్న గావస్కర్ ఆకాశ్‌పై విమర్శలు చేశాడు. 'ఇప్పుడు ఆ 'చిట్' (చీటీ) ఎక్కడ ఉంది?' ఆ చిట్ జేబులోనే ఉంది కదా? అని నేను అడుగుతున్నాను. ఒక ఓవర్‌లో ఆరు బంతులు ఉంటాయి. అందులో బహుశా ఒక్క బంతికి మాత్రమే వికెట్



దొరకవచ్చు. అతడు వేస్తున్న మిగిలిన ఐదు బంతులను బ్యాటర్లు బౌండరీలకు తరలిస్తున్నారు. అలా 17 బంతుల్లో ఆకాశ్ 48 పరుగులు సమర్పించుకున్నాడు" అని గావస్కర్ అన్నాడు. ఐపీఎల్ లో యువ క్రికెటర్లు నోట్ సంబరాలు చేసుకోవడంపై మాజీలు స్పందించారు. ఇది క్రికెట్‌లో ట్రెండ్ కాదని, ఆ చిటీలను బయట పడేయండి అంటూ సౌతాఫ్రికా మాజీ డెల్ స్టెయిన్ రీసెంట్‌గా ఎక్స్ లో పోస్టు చేశాడు. 'ఆ కాగితాలను (చీటీలను) పక్కన పడేసే సమయం వచ్చింది. ఆ సెలబ్రేషన్ ఇప్పుడు ట్రెండింగ్‌లో లేదు. క్రికెట్‌లో అది ట్రెండింగ్ కూడా కాదు' అని స్టెయిన్ పోస్ట్‌లో రాసుకొచ్చాడు.లఖ్‌నవూ రీసెంట్‌గా చెన్నైతో మ్యాచ్ ఆడింది. ఈ మ్యాచ్‌లో ఆకాశ్ సింగ్ 3 వికెట్లతో రాణించాడు. దీంతో అతడు మైదానంలో నోట్ సంబరాలు చేసుకున్నాడు. అంటే తన జేబులో నుంచి చీటీ తీసి కెమెరాకు చూపించాడు. తాజా మ్యాచ్‌లో విఫలం అవ్వడంతో గావస్కర్ విమర్శించాడు. అయితే ఇటీవల కాలంలో ఐపీఎల్‌లో యంగ్ ప్లేయర్లు నోట్ సంబరాలు చేసుకోవడం కామన్‌గా మారింది. గతేడాది సన్‌రైజర్స్ బ్యాటర్ అభిషేక్ శర్మ ఈ రకమైన సంబరాలు చేసుకోగా, ఈ సీజన్‌లో చెన్నై బ్యాటర్ ఉర్విల్ పటేల్, ముంబయి బౌలర్ రఘు శర్మ అదే ఫాలో అయ్యాయి. ఇక మ్యాచ్ విషయానికొస్తే, కీలక పోరులో రాజస్థాన్ రాయల్స్ ఘన విజయం సాధించింది. జైపుర్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో నెగ్గింది. లఖ్‌నవూ నిర్దేశించిన 221 పరుగుల లక్ష్యాన్ని రాజస్థాన్ 19.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ (93 పరుగులు, 38 బంతుల్లో), ధ్రువ్ జురెల్ (53 పరుగులు) హాఫ్ సెంచరీలతో ఆకట్టుకున్నారు. లఖ్‌నవూ బౌలర్లలో ఆకాశ్ సింగ్, మొహ్సిన్ చెరో 1 వికెట్ దక్కించుకున్నారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన లఖ్‌నవూ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 220 పరుగులు చేసింది. ఓపెనర్ మిచెల్ మార్ష్ (96 పరుగులు) త్రుటిలో సెంచరీ మిస్ చేసుకున్నాడు.

## ఒక్క స్థానం కోసం 5 జట్ల మధ్య భీకర పోరు

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 ప్లే ఆఫ్స్ రేసు రసవత్తరంగా మారింది. లీగ్ దశ 24న ముగుస్తుంది. ఇప్పటి వరకు ఆర్సీబీ, గుజరాత్



టైటాన్స్, సన్ రైజర్స్ హైదరాబాద్ జట్లు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించాయి. ప్లే ఆఫ్స్ చేరే నాలుగో జట్టు ఏదో తేలాల్సి ఉంది. మిగిలిన ఆ ఒక్క స్థానం కోసం ఏకంగా 5 జట్లు పోటీ పడుతున్నాయి.

ప్లే ఆఫ్స్‌లో మిగిలి ఉన్న నాలుగో బెర్త్ కోసం రాజస్తాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్, చెన్నై సూపర్ కింగ్స్, కేకేఆర్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య పోటీ నెలకొని ఉంది. లక్నోపై నెగ్గిన రాజస్తాన్ రాయల్స్ 14 పాయింట్లతో నాలుగో స్థానానికి చేరుకోగా.. పంజాబ్ కింగ్స్ 13 పాయింట్లతో ఐదో స్థానంలో ఉంది. ఇక చెన్నై సూపర్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్లు చెరో 12 పాయింట్లతో ఉండగా.. కేకేఆర్ 11 పాయింట్లతో ఉంది.రాజస్తాన్, పంజాబ్, చెన్నై, ఢిల్లీ జట్లకు ఒక్కో మ్యాచ్ మిగిలి ఉండగా.. కేకేఆర్‌కు రెండు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. ప్లే ఆఫ్స్‌లో మిగిలి ఉన్న నాలుగో బెర్త్ ఈ ఐదు జట్లలో ఒకదానికి దక్కే ఛాన్స్ ఉంది.

అధికారికంగా 5 జట్లు రేసులో ఉన్నా.. ప్రస్తుతం ఉన్న ఫామ్‌ను బట్టి చూస్తే ప్లే ఆఫ్స్ చేరే అవకాశాలు ఒక జట్టుకే ఎక్కువగా ఉన్నాయి.రాజస్థాన్ రాయల్స్ 14 పాయింట్లతో ప్రస్తుతం 4వ స్థానంలో ఉంది. ఒక మ్యాచ్ మిగిలి ఉంది. ముంబై ఇండియన్స్‌తో మే 24న పోరు ఉంది. ఇందులో నెగ్గితే ఇతర జట్ల ఫలితాలతో సంబంధం లేకుండా రాజస్తాన్ రాయల్స్ నేరుగా ప్లే ఆఫ్స్ చేరుతుంది. అయితే ముంబైని ఓడించడం అంత సులభం కాదు. ఇక 5వ స్థానంలో ఉన్న పంజాబ్ కింగ్స్ ప్రస్తుతం 13 పాయింట్లతో ఉన్నాయి. పంజాబ్ కింగ్స్ తన చివరి మ్యాచ్‌ను ఈ నెల 23న లక్నో సూపర్ జెయింట్స్‌తో ఆడనుంది. ఇందులో నెగ్గితే 15 పాయింట్లకు చేరుకుంటుంది. అప్పుడు చెన్నై, ఢిల్లీ క్యాపిటల్స్ జట్లు తమ చివరి మ్యాచ్‌ల్లో నెగ్గినా ప్లే ఆఫ్స్‌కు చేరవు. ఎందుకంటే చెన్నై, ఢిల్లీ జట్లు చివరి మ్యాచ్‌ల్లో నెగ్గితే 14 పాయింట్లకు చేరుకుంటాయి. కానీ, పంజాబ్ ఖాతాలో 15 పాయింట్లు ఉంటాయి.ఇక కేకేఆర్ ప్లే ఆఫ్స్ చేరాలంటే చివరి రెండు మ్యాచ్‌ల్లో తప్పక నెగ్గాల్సి ఉంది. ముంబైతో ఈ నెల 20న ఆడనుంది. అనంతరం 24న ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడనుంది. ఈ రెండు మ్యాచ్‌ల్లో కేకేఆర్ నెగ్గాలి. ఒక్క దాంట్లో ఓడినా ప్లే ఆఫ్స్ నుంచి తప్పుకుంటుంది. గెలిచిన తర్వాత కూడా పంజాబ్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ ఫలితాలపై ఆధారపడాల్సి ఉంటుంది.ప్రస్తుతం ఉన్న పరిస్థితులను చూస్తే.. పంజాబ్ కింగ్స్‌కు ప్లే ఆఫ్స్ చేరేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. ఎందుకంటే ఆ జట్టు లక్నోతో ఆడాల్సి ఉంది. ఇక రాజస్తాన్ రాయల్స్ ముంబైతో.. కేకేఆర్ ముంబై, ఢిల్లీ జట్లతో.. చెన్నై సూపర్ కింగ్స్ గుజరాత్ టైటాన్స్‌లతో ఆడాల్సి ఉంది. పంజాబ్ గెలిస్తే..చెన్నై, ఢిల్లీ జట్లు ఎలిమినేట్ అవుతాయి.

## వైభవ్ పలు రికార్డులు నమోదు

రాజస్థాన్ చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీ మరో సంచలన ఇన్నింగ్స్‌తో ట్రెండింగ్‌లోకి వచ్చాడు. తాజాగా లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో మ్యాచ్‌లో 38 బంతుల్లోనే 93 పరుగులు బాది విజయంలో కీలక పాత్ర పోషించాడు. దీంతో అతడికి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. ఈ క్రమంలోనే వైభవ్ పలు రికార్డులు నమోదు చేశాడు.అయితే ఐపీఎల్‌లో తొలి సీజన్ నుంచి ఆడుతున్న విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మకు సైతం ఏ ఎడిషన్‌లోనూ ఈ ఫీట్ సాధ్యం కాలేదు. ఈ స్టార్ క్రికెటర్లు తమతమ కెరీర్‌లో ఐపీఎల్‌లో సింగిల్ ఎడిషన్‌లో 50 సిక్స్‌లు బాదలేదు. కానీ, పట్టుమని పాతిక మ్యాచ్‌లు కూడా ఆడని వైభవ్ తన కెరీర్‌లో రెండో సీజన్‌లోనే ఈ అరుదైన ఫీట్ సాధించాడు. ప్రస్తుత ఎడిషన్‌లో వైభవ్ తాజా మ్యాచ్‌తో 500 పరుగుల మార్క్ దాటేశాడు. ఇప్పటిదాకా 13 మ్యాచ్‌ల్లో 579 పరుగులు చేసిన అతడు టాప్‌లో కొనసాగుతున్నాడు. దీంతో ప్రపంచంలోని ఏ టీ20 లీగ్‌లో అయినా 500ం పరుగుల మార్క్ టచ్ చేసిన అతిచిన్న వయసున్న క్రికెటర్‌గా రికార్డ్ కొట్టాడు. ఇది ఐపీఎలే కాదు, వరల్డ్ రికార్డ్ కూడా. ప్రస్తుతం అతడి వయసు 15ఏళ్లు. ఈ సీజన్‌లో వైభవ్ క్రీజులోవచ్చుడంటే చాలు ఫోర్లు, సిక్సలతో తొలి ఓవర్ నుంచే బాదడం షురూ చేస్తున్నాడు. దీంతో ఐపీఎల్ చరిత్రలో అత్యధిక స్ట్రైక్ రేట్‌తో 500ం పరుగులు చేసిన రికార్డు కొట్టాడు. ప్రస్తుతం అతడి స్ట్రైక్ రేట్ 233గా ఉంది. ఇదివరకు ఈ రికార్డు కోల్‌కతా నైట్‌రైడర్స్ ఆండ్రీ రస్సెల్ 205 (2019 లో) స్ట్రైక్ రేట్ పేరిట ఉండేది. ఈ లిస్ట్‌లో వరుసగా అభిషేక్ శర్మ 202, నికోలస్ పూరణ్ 196 (2025లో), ట్రావిస్ హెడ్ (2024లో) 192 స్ట్రైక్ రేట్‌తో ఉన్నారు 13 మ్యాచ్‌ల్లో వైభవ్ 579 పరుగులు చేశాడు. ఇందులో 50 ఫోర్లు, 53 సిక్స్‌లు ఉండడం



విశేషం. అంటే బౌండరీలతోనే వైభవ్ 518 రన్స్ సాధించడన్నమాట! ఈ సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా వైభవ్ టాప్‌లో కొనసాగుతున్నాడు. ఆరెంజ్ క్యాప్ ప్రస్తుతం అతడి దగ్గరే ఉంది.అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేయకముందే ఐపీఎల్‌లో అత్యధిక పరుగులు బాదిన మూడో అన్‌క్యాప్డ్ బ్యాటర్‌గా వైభవ్ కొనసాగుతున్నాడు. ఈ ఇన్నింగ్స్‌తో రాజస్థాన్ కెప్టెన్ రియాన్ పరాగ్ (573 రన్స్, 2024లో)ను అధిగమించాడు. కాగా ఈ లిస్ట్‌లో రాజస్థాన్ యంగ్ బ్యాటర్ యశస్వీ జైస్వాల్ టాప్‌లో ఉన్నాడు. అతడు 2023లో రాజస్థాన్ తరఫున 625 పరుగులు చేశాడు. జైస్వాల్ తర్వాత రెండో స్థానంలో షాన్ మార్ష్ ఉన్నాడు. మార్ష్ 2018లో పంజాబ్ కింగ్స్ తరఫున 616 పరుగులు సాధించాడు. అయితే రాజస్థాన్ ఇంకో మ్యాచ్ ఆడాల్సి ఉంది. అలాగే ప్లేఆఫ్స్‌కు క్వాలిఫై అయితే అక్కడా ఇంకో రెండు, మూడు మ్యాచ్‌లు ఆడే ఛాన్స్ ఉంటుంది. అందుకే ఈ జైస్వాల్ రికార్డు ఈ సీజన్‌లోనే బ్రేక్ అయినా ఆశ్చర్యం లేదు!




## డ్రాగన్ గ్లింప్స్ రిలీజ్

దర్శకుడు ప్రశాంత్ నీల్, తారక్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ టైటిల్‌ను చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటిస్తూ పవర్‌ఫుల్ ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఎన్టీఆర్ పుట్టినరోజు కానుకగా ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. మే 19 అర్ధరాత్రి తారక్ బర్త్‌డేకి కొన్ని నిమిషాల ముందే విడుదలైన ఈ గ్లింప్స్ ప్రస్తుతం సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ప్రశాంత్ నీల్ తన మార్క్ డార్క్ థీమ్‌తో ఏకంగా 4 నిమిషాల 28 సెకండ్ల నిడివితో ఒక భారీ విజువల్ వండర్‌ను ప్రేక్షకులకు పరిచయం చేశారు. ఈ గ్లింప్స్ వీడియో 1967 నాటి అంతర్జాతీయ ఓపియం బ్యాక్‌డ్రాప్‌లో, గోల్డెన్ ట్రయాంగిల్ నేపథ్యంలో సాగే ఒక క్రూరమైన, హింసాత్మకమైన చీకటి ప్రపంచాన్ని కళ్లకు కట్టింది. ఇందులో హీరోయిన్ రుక్మిణి వసంత్ వాయిస్ ఓవర్‌తో కథా నేపథ్యాన్ని, అందులోని పాత్రలను పరిచయం చేస్తూ చివరగా అసలైన 'డెవిల్'ను ఎంట్రీ చేయించారు. అఫ్ఘాన్ ట్రేడింగ్ కంపెనీకి 'చీఫ్ అసస్సిన్' (ప్రధాన హంతకుడు) అయిన 'లూగర్'అనే అత్యంత భయంకరమైన పాత్రలో ఎన్టీఆర్ లుక్ మైండ్ బ్లోయింగ్‌గా ఉంది. ఈ గ్లింప్స్‌లో ఎన్టీఆర్ రఫ్ అండ్ లీన్ లుక్, గంభీరమైన కళ్లు అభిమానులకు పూనకాలు తెప్పిస్తున్నాయి. ముఖ్యంగా ఒక సీన్ లో శవాల దిబ్బపై నిలబడి ఎన్టీఆర్ చెప్పే డైలాగ్ థియేటర్లలో విసిల్ వర్షీగా నిలవడం ఖాయం. 'దేవుడు నాకో గొప్ప వరం ఇచ్చాడు.. ట్రిగ్గర్ నొక్కగానే మర్చిపోవడం' అంటూ తారక్ బేస్ వాయిస్‌తో చెప్పిన డైలాగ్ సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. ప్రశాంత్ నీల్ సృష్టించిన ఈ సరికొత్త ప్రపంచంలో ఎన్టీఆర్ క్యారెక్టరైజేషన్ మునుపెన్నడూ చూడని విధంగా, ఒక ఊరమాస్ బీస్ట్ మోడ్లో ఉంది. ఈ భారీ యాక్షన్ డ్రామాలో బాలీవుడ్ ఎవర్ గ్రీన్ స్టార్ అనిల్ కపూర్ ఇండియన్ నార్కోటిక్స్ బ్యూరో చీఫ్ 'రఘువీర్ రాథోడ్'గా ఒక పవర్‌ఫుల్ రోల్‌లో కనిపిస్తుండగా, బిజు మీనన్, ఖుష్బూ సుందర్, అశుతోష్ రాణా, గురు సోమసుందరం, రాజీవ్ కనకాల వంటి భారీ తారాగణం నటిస్తున్నారు.

సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..

# సినిమా

## డ్రాగన్‌లో ఎన్టీఆర్ పేరు.. లూగర్

అగ్ర దర్శకుడు ప్రశాంత్ నీల్, యంగ్ టైగర్ ఎన్టీఆర్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'డ్రాగన్' ఫస్ట్ గ్లింప్స్ ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా విడుదలై సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. అయితే ఈ గ్లింప్స్‌లో అందరి దృష్టిని ఆకర్షించిన ప్రధాన అంశం ఎంటంటే.. ఎన్టీఆర్ క్యారెక్టర్ పేరు 'లూగర్'. ప్రశాంత్ నీల్ తన సినిమాల్లో హీరోల పేర్లను చాలా పవర్‌ఫుల్‌గా డిజైన్ చేస్తాడన్న సంగతి తెలిసిందే. కేజీఎఫ్ లో 'రాకీ', సలార్ లో 'దేవా' అలాగే ఈ సినిమాలో ఎన్టీఆర్ పాత్రకు




'లూగర్' అనే వెరైటీ పేరు పెట్టడం వెనుక ఒక బలమైన కారణం ఉన్నట్లు తెలుస్తుంది. ఈ విషయంపై చిత్రబృందం స్పందించకపోగా.. 'లూగర్' అనే పదానికి గూగుల్, వీకిపిడియాలో ఒక అర్థం కనిపిస్తుంది. అది ఏంటి అనేది చూసుకుంటే. 'లూగర్' అనేది ఒక క్లాసిక్ జర్మన్ పిస్టల్ (తుపాకీ) పేరు అని తెలుస్తుంది. వరల్డ్ వార్ సమయంలో జర్మనీ సైన్యం ఉపయోగించిన ఈ లూగర్ పిస్టల్.. అత్యంత ఖచ్చితమైన లక్ష్యానికి, ప్రాణాంతకమైన వేగానికి, క్రూరత్వానికి మారుపేరని సమాచారం. సినిమాలో ఎన్టీఆర్ పాత్ర కేవలం ఒక సాధారణ మనిషిలా కాకుండా, ఒక లోడెడ్ గన్‌లా.. శత్రువులను వేటాడే ఒక ప్రాణాంతక ఆయుధంలా ఉండబోతోంది. అందుకే ప్రశాంత్ నీల్ ఈ పేరును ఎంచుకున్నట్లు సమాచారం. ఈ సినిమాలో ఎన్టీఆర్ 'అఫ్ఘన్ ట్రేడింగ్ కంపెనీ'కి చెందిన 'అసాసిన్-ఇన్-చీఫ్' ప్రధాన షార్ప్ షూటర్గా కనిపిస్తున్నారు. 1967 కాలానికి చెందిన అంతర్జాతీయ ఓపియం (నల్లమందు) వ్యాపారం, స్మగ్లింగ్ మాఫియా నేపథ్యంలో ఈ పీరియడ్ యాక్షన్ డ్రామా తెరకెక్కుతోంది. బ్రిటిష్ వారు భారతదేశాన్ని విడిచి వెళ్ళిన తర్వాత ఓపియం వ్యాపారం 'అఫ్ఘన్ ట్రేడింగ్ కంపెనీ', 'గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ'లుగా విడిపోతుంది. ఈ క్రమంలో జరిగే రక్తపాతం, మాఫియా యుద్ధాల చుట్టూ కథ తిరుగుతుంది. ఈ సినిమాలో ఎన్టీఆర్ సరసన రుక్మిణీ వసంత నటిస్తుండగా.. నార్కోటిక్స్ బ్యూరో చీఫ్ 'రఘువీర్ రాథోడ్' పాత్రలో బాలీవుడ్ స్టార్ అనిల్ కపూర్ నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ చిత్రం జూన్ 11, 2027 న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.


## దురంధర్-2పై హైకోర్టులో వ్యాజ్యం

బాక్సాఫీసు వద్ద రికార్డు సృష్టించిన 'ధురంధర్ 2' కు ఇప్పుడు ఓ చిక్కు ఎదురైంది. ఈ సినిమాలో సాయుధ దళాల కార్యకలాపాల వివరాలను బహిర్గతం చేశారని, దీనివల్ల దేశ భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందంటూ దిల్లీ హైకోర్టులో పిల్ దాఖలైంది.

సశస్త్ర సీమా బల్ లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న దీపక్ కుమార్ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనిపై బుధవారం విచారణ చేపట్టిన న్యాయస్థానం.. ఆ సినిమా కల్పిత కథ కావచ్చుని, కానీ భద్రతాదళ సిబ్బంది లేవనెత్తిన ఆందోళనలనూ విస్మరించలేమని వ్యాఖ్యానించింది. ఈ ఆరోపణలపై విచారణ జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ని ఆదేశించింది. ఈ సినిమా స్పై యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన సంగతి తెలిసిందే. రణ్‌వీర్ సింగ్ హీరోగా దర్శకుడు ఆదిత్యధర్ తెరకెక్కించిన ఈ చిత్రం మార్చిలో విడుదలై, రూ.1800 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టింది. విదేశాల్లో ఇప్పటికే 'నెట్‌ఫ్లిక్స్'లో స్ట్రీమింగ్ అవుతున్న ఈ మూవీ.. భారత్‌లో జూన్ 5 నుంచి ఓటీటీ 'జియో హాట్‌స్టార్'లో స్ట్రీమింగ్ కానుంది. జూన్ 4న రాత్రి 7గంటలకు డిజిటల్ ప్రీమియర్ ఉండనుంది.

## బాలకృష్ణ మూవీలో మంచు మనోజ్

'వీర సింహారెడ్డి' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత బాలయ్య, గోపీచంద్ మలినేని కలయికలో తెరకెక్కుతోన్న ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో నటుడు మంచు మనోజ్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకున్న దర్శకుడు, మనోజ్ పోషించబోయే పాత్ర ఎంతో పవర్‌ఫుల్‌గా ఉండబోతోందని, థియేటర్లలో ఆ మ్యాజిక్‌ను ప్రేక్షకులు ఎప్పుడు చూస్తారా అని తాను ఎంతగానో ఎదురుచూస్తున్నానని పేర్కొన్నారు. కాగా ఈ సినిమాలో మనోజ్ ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. గతంలో 'ఊ..కొడతారా ఉలిక్కిపడతారా' చిత్రంలో కలిసి నటించిన బాలకృష్ణ, మంచు మనోజ్ మళ్లీ కలిసి నటిస్తుండటంతో మూవీపై




భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ భారీ బ్జడెట్ మూవీలో బాలకృష్ణ ద్విపాత్రాభినయం చేస్తుండటం విశేషం. ఇందులో బాలయ్య సరసన కథానాయికగా నయనతార నటిస్తున్నారు. 'సింహా', 'శ్రీరామరాజ్యం', 'జైసింహా' వంటి ఘనవిజయాల తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న నాలుగో చిత్రం ఇది కావడంతో ఈ జంట మరోసారి బాక్సాఫీస్ వద్ద మేజిక్ రిపీట్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది. ఎస్.ఎస్. తమన్ ఈ సినిమాకు సంగీతం అందిస్తుండగా.. వృద్ధి సినిమాస్ ఈ సినిమాను నిర్మిస్తుంది.

## ఓటిటిలోకి సతీ లీలావతి

మెగా కోడలు లావణ్య త్రిపాఠి కొణిదెల వివాహం తర్వాత వెండితెరపై నటించిన సరికొత్త రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం సతీ లీలావతి. మలయాళ




నటుడు దేవ్ మోహన్ హీరోగా, 'భీమిలి కబడ్డీ జట్టు'వంటి చిత్రాల ఫేమ్ డైరెక్టర్ తాతినేని సత్య దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం మే 8న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలైంది. అయితే బాక్సాఫీస్ వద్ద ఈ చిత్రం ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను మెప్పించలేకపోవడంతో, థియేట్రికల్ రన్ చాలా త్వరగానే ముగిసిపోయింది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ ఎవరూ ఊహించని విధంగా కేవలం 12 రోజుల వ్యవధిలోనే ఈ సినిమాను ఓటీటీ వేదికగా డిజిటల్ స్ట్రీమింగ్‌లోకి తీసుకువచ్చింది. మెగా ఫ్యామిలీకి చెందిన ఒక నటి నటించిన సినిమా ఇంత తక్కువ సమయంలో ఓటీటీ బాట పట్టడం టాలీవుడ్‌లో ఇదే మొదటిసారి కావడం విశేషం. ప్రముఖ డిజిటల్ ఎ÷-లాట్‌ఫామ్‌లు 'సన్ నెక్ట్స్' తో పాటు జియో హాట్‌స్టార్‌లు ఈ చిత్ర డిజిటల్ హక్కులను సొంతం చేసుకోగా, మే 20 నుంచే తెలుగుతో పాటు తమిళ భాషల్లోనూ ఈ సినిమా స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సినిమా కథ విషయానికి వస్తే కథలో లీలావతి (లావణ్య త్రిపాఠి) ఒక స్టార్ డైరెక్టర్. చిన్నతనం నుంచి తల్లిదండ్రుల గొడవల వల్ల కొన్ని మానసిక భయాలతో పెరుగుతున్న ఆమెకు సైకాలజిస్ట్ రామ్ సేతు (దేవ్ మోహన్) అండగా నిలబడి ఆ భయాల నుండి బయటపడేస్తాడు. ఈ క్రమంలోనే ఇద్దరూ ప్రేమలో పడి పెళ్లి చేసుకుంటారు. అయితే పె÷-ళ్లైన మూడేళ్ల తర్వాత, తాను వేరే అమ్మాయి (మడోన్నా సెబాస్టియన్)తో ప్రేమలో ఉన్నానని, తనకు విడాకులు కావాలని రామ్ సేతు భార్యను కోరతాడు. దీంతో షాక్‌కు గురైన లీలావతి భర్తను ఇంట్లోనే బంధిస్తుంది. ఆ తర్వాత వారి జీవితాలు ఎలాంటి మలుపులు తిరిగాయి, అసలు సేతు బ్యాక్‌గ్రౌండ్ ఏంటి, చివరికి ఈ జంట ఎలా ఒకటయ్యారు అనేదే ఈ సినిమా ముఖ్య కథాంశం.

Printed, Published & Owned by Margam Rama on behalf of ADUGU DIGITAL MEDIA Pvt. Ltd, Printed and Published at ADUGU PRESS, H No: 7-120, PALAKURTHI Village & Mandal, Jangaon District, Telangana, PIN: 506146. Chief Editor: Dr.Margam Lakshmi Narayana, Ph.No. : 8499990005